క్లుప్తంగా

ఘనంగా సోమాలమ్మ తల్లి గ్రామోత్సవం



సోమాలమ్మకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నల్లజర్ల: సంక్రాంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా నల్లజర్ల గ్రామ దేవత సోమాలమ్మ తల్లికి భక్తులు గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, గరగ నృత్యాల నడుమ అమ్మవారిని ప్రత్యేక వాహనంపై అలంకరించి వీధివీధినా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పసుపు నీళ్ల ఓరపోసి అమ్మవారికి ధూపదీపాలతో చలిమిడి, పానకాలు సమర్పించారు. గ్రామమంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, గ్రామస్తులందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు.

యువకుడి అదృశ్యం



చుక్కల శ్రీనివాస్

పెరవలి: మండలంలోని నడుపల్లి గ్రామానికి చెందిన చుక్కల శ్రీనివాస్(30) పదిహేను రోజుల క్రితం ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అదృశ్యమైన శ్రీనివాస్ ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో పెరవలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. యువకుడి ఆచూకీ తెలిస్తే 9440796642 నంబరుకు సమాచారం అందివ్వాలని కోరారు.

20న వాహనాలకు వేలం

కొవ్వూరు: పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో నాటుసారా, ఇతర కేసుల్లో పట్టుబడిన ఐదు మోటారు సైకిళ్లకు ఈనెల 20వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రూ.5 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని సూచించారు.రాజమహేంద్రవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఈ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో వాహనం పాడుకున్న వ్యక్తులు అదే రోజు వేలం సొమ్ముతో పాటు 18 శాతం జీఎస్టీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన వారు 94409 02430 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా సోమాలమ్మ ఉత్సవాలు



సమిశ్రగూడెంలో పుష్పాలంకరణలో అమ్మవారు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం గరువువీధిలో వేంచేసి యున్న సోమాలమ్మ ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సోమాలమ్మను గ్రామ పురవీధుల్లో గురువారం ఊరేగించారు. సోమాలమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరీ, కాళీమాత నృత్య ప్రదర్శనలు, సినీ మ్యూజికల్ బ్యాండ్ పార్టీ, తీనామార్, కోబ్రా డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 18న భారీ అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల నీరు విడుదల



నిడదవోలు వద్ద పశ్చిమడెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు : విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు గురువారం 5,800 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. గోదావరి పశ్చిమడెల్టా పరిధిలో రైతుల సాగునీటి అవసరాల మేరకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. తూర్పు డెల్టాకు 3,780, సెంట్రల్ డెల్టాకు 2,460 క్యూసెక్కులు వదులుతున్నారు. పశ్చిమడెల్టా పరిధిలో నరసాపురం కాలువకు అత్యధికంగా 1983 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఏలూరు కాలువలకు 1124, తణుకు కాలువకు 641, అత్తిలి కాలువకు 509 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

మాడిపోతున్నాయి

- రసాన్ని పీల్చేస్తున్న పురుగులు
- జీడి తోటల్లో పూత, పిందెకు దెబ్బ
- ఆందోళనలో రైతులు



దూబచర్ల శివారు కొత్తగూడెంలో సస్యరక్షణ చర్యలు చేపడుతున్న రైతులు



జీడిమామిడిలో మాడిపోతున్న పూత, పిందె

నల్లజర్ల: జీడి మామిడి తోటల్లో లేత కొమ్మలను, పూత రెమ్మలను పురుగులు ఆశించి రసాన్ని పీల్చేయడంతో పూత, పిందె మాడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో పూత, పిందె వచ్చి ఏప్రిల్‌లో ఫలసాయం చేతికందుతుంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో తోటల్లో ఆశించిన రీతిలో పూత, పిందె లేవని రైతులు చెబుతున్నారు. మండలంలో దాదాపు 600 హెక్టార్లలో జీడిమామిడి తోటలున్నాయి. ఒక తోటలో 100 చెట్లుంటే 40 శాతం చెట్లకు పూతలు, పిందెలు ఆశాజనకంగా ఉన్నాయి. మిగిలిన 60 శాతం చెట్లలో అసలు పూత, పిందె కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. పూతలు రావడానికి కొందరు, వచ్చిన పూతలు నిలబడటానికి ఇంకొందరు ఇప్పటికే రెండు మూడుసార్లు అప్పులు చేసి మరీ మందులు పిచికారీ చేస్తున్నారు. వాతావరణం చల్లగా ఉండటం, పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.

సస్యరక్షణ చేపట్టాలి

జీడితోటలపై టీదోమ, తామర పురుగు, గెలమాగుడు తెగులు, మొదలు కుళ్లు తెగుళ్లు ఉన్నాయని, వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. వారి సూచనలివీ..

- టీదోమ పిల్ల, తల్లి పురుగులు జీడిమామిడి లేత కొమ్మలను, పూత రెమ్మలను ఆశించి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురు బిందువులు, పూత రెమ్మలపై నల్లని పొడవైన కండె ఆకారపు మచ్చలు ఏర్పడతాయి. దీని ప్రభావంతో పూత, పిందె రాలిపోయి దిగుబడి పడిపోతుంది.
- కాయల మీద తామర పురుగులు ఆశించి, గోకి తినేయడం వల్ల గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. ఈ పురుగు ఉధృతమైతే చెట్టంతా మాడిపోయినట్టు కనపడుతుంది.
- టీదోమ నివారణకు లాబ్డాసైహలోత్రిన్ 2 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి కాయ ఏర్పడే దశలో పిచికారీ చేసుకోవాలి.
- సస్యరక్షణ చేపట్టే ముందు తోటల సరిహద్దుల్లో జామ, వేప, మునగ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- గెలమాగుడు తెగులు నివారణకు మేంకోజబ్ గ్రాము మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- తామర పురుగుల నివారణకు రీజెంట్ ఒక మిల్లీలీటర్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- కాండం తొలుచు పురుగును గమనిస్తే ఇనుప చువ్వతో మొదలు తవ్వి, నువాన్ మందును దూదిలో ముంచి అందులో పెట్టి, బూడిదతో గాని, పేడతో గాని పూడ్చాలి.
- గింజ గట్టి పడటానికి, సూక్ష్మధాతు లోపాల నివారణకు ఫార్ములా–4ను వినియోగించాలి.

పూత రాకపోతే..



మామిడి, జీడిమామిడి తోటల్లో పూత రాకపోతే 13–0–45 రసాయన ఎరువు 10 గ్రాములు, 3 గ్రాముల సల్ఫర్, 1.6 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీంతో పాటు పూత రాని తోటల్లో పొగ పెట్టాలి. దీనివలన పూత వచ్చే అవకాశం ఉంటుంది. మరో 10, 15 రోజుల్లో అన్ని తోటల్లో పూత వచ్చే అవకాశం ఉంది. తర్వాత చెట్లకు ఎరువులు వేసి, నీటి తడులు అందించాలి.

– **ఎం.బబిత**, ఉద్యాన శాఖాధికారి, నల్లజర్ల

వ్యాపారాభివృద్ధికి నమ్మకమే మూలం



తాళ్లపూడిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై, తదితరులు

తాళ్లపూడి: వ్యాపారాభివృద్ధికి ఖాతాదారుల నమ్మకం అవసరమని తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ అన్నారు. తాళ్లపూడిలోని రత్న గణేష్ సూపర్ మార్కెట్ వారు సంక్రాంతి సందర్భంగా లక్కీడిప్‌ను గురువారం ప్రకటించారు. గత నెల రోజులుగా తమ షాపులో కొనుగోళ్లు జరిపిన ఖాతాదారులకు ఉచితంగా కూపన్‌లు అందజేశారు. 1200 మంది ఖాతాదారుల నుంచి లక్కీడీప్ తీయగా 18 మందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఎస్సై టి రామకృష్ణ, మండల రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సింహాద్రి జనార్ధనరావు, మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల బాబూరావు, ఏఎస్‌వో జె వెంకటేశ్వరారావు, ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న , కేపీ, పువ్వాడ గణేష్, పువ్వాడ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు మధ్యేమార్గం



తీపర్రులో చేలల్లో నీరు బయటకు వెళ్లకుండా గట్టుకు ప్లాస్టిక్ కవర్లు కట్టి ఉంచిన రైతు

- చేలల్లో గట్లకు ప్లాస్టిక్ కవర్లు వేసి కట్టడి

పెరవలి: ప్రతి ఏడాది దాళ్వా వరి పంటకు సాగునీటి ఎద్దడి ఉండటంతో ఈ ఏడాది కూడా ఉంటుందేమోనని కలత చెందిన రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి చర్యలు చేపట్టారు. రబీపై ఎన్నో ఆశలతో సాగు చేపట్టిన రైతులు సాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించటానికి మురుగు, పంట కాలువల్లో నీటిని అడ్డుకట్ట వేసి నిల్వ చేస్తున్నారు. అధికారులు కూడా దాళ్వాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందిస్తామని భరోసా ఇవ్వటంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. నిడదవోలు నియోజకవర్గంలో 35,500 ఎకరాల్లో రబీ సాగు చేపట్టారు. వరిచేలల్లో నాట్లు వేసిన రైతులు నీటి ఎద్దడి ముప్పు పొంచి ఉందని ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో చేలో ఉన్న నీరు బయటకు వెళ్లకుండా గట్లపై ప్లాస్టిక్ కవర్లు వేసి కట్టడి చేస్తున్నారు. పెట్టుబడి ఎక్కువయినా నీటికోసం ఈ పాట్లు తప్పడం లేదని రైతులు చెబుతున్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లినా నీటికోసం ఈ తిప్పలు తప్పవని రైతులు వివరిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల, యాదవోలు సబ్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఆ వివరాలివీ..

- పల్లంట్లలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం పల్లంట్ల, లక్ష్మీపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తారు. వ్యవసాయానికి ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ సరఫరా ఇస్తారు. పనులు పూర్తయిన తర్వాత మిగిలిన సరఫరా ఇస్తారు.
- యాదవోలు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ వెదుళ్లకుంట ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తారు. ప్రత్యామ్నాయంగా వ్యవసాయానికి ఉదయం 4 నుంచి 8 గంటల వరకూ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా చేస్తారు.

కొవ్వూరు: పట్టణంలోని 33/11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వార్షిక మరమ్మత్తుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నిడదవోలు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ పరిధిలోని అన్ని ఫీడర్లకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు చెప్పారు. పట్టణంలోని గౌతమినగర్, ఫ్యాక్టరీ రోడ్డు, మెయిన్‌రోడ్డు, కోర్టు ఏరియా, సత్యవతి నగర్, ఇందిరమ్మ కాలనీ, శ్రీనివాసపురం, బ్రిడ్జిపేట, క్రిస్టియన్ పేట, శ్రీరామ్ కాలనీ, రాజీవ్ కాలనీ, స్పెక్ సమీపంలోని జగనన్న కాలనీలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని తాడిమళ్ల గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామ పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: 11 కేవీ వేలివెన్ను ఫీడర్ మరమ్మతుల నిమిత్తం మోర్త సబ్‌స్టేషన్ పరిధిలోని మోర్త, దమ్మెన్ను గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐదు తరాల ఆత్మీయ సమ్మేళనం



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో కలిసిన నిమ్మగడ్డ కుటుంబానికి చెందిన మహిళలు

నిడదవోలు రూరల్: బంధాలను సెల్‌ఫోన్‌లకే పరిమితం చేసి బంధువులు సైతం ఒకరి నొకరు పరిచయం చేసుకునే దుస్థితికి దిగజారిన ప్రస్తుత రోజుల్లో ఐదు తరాలకు చెందిన సుమారు 200 మంది కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలుసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. విదేశాలతో పాటు వివిధ రాష్ట్రాల్లోని బంధు గణమంతా కదలి వచ్చారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన నిమ్మగడ్డ ఇంటిపేరు కలిగిన కుటుంబ సభ్యులంతా కలిసి గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నిమ్మగడ్డ కుటుంబానికి చెందిన వృద్ధులు, ఆడపడుచులు, యువత, చిన్నారులు అంతా కలిసి ఆటపాటలతో సందడి చేశారు. నిమ్మగడ్డ మురళి, హరిబాబు, వీరబాబు, గోపాలకృష్ణ, సత్యనారాయణమూర్తి (సత్తెన్న)లు ఈ ఆత్మీయ సమ్మేళన ఏర్పాటుకు కీలకంగా వ్యవహరించారు.

పెట్రోల్ బంక్ సిబ్బందిపై ఫిర్యాదు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని పెట్రోల్ బంక్‌లో డీజిల్ తక్కువగా ఎందుకు కొట్టారని ప్రశ్నిస్తే బంకు సిబ్బంది తనపై దౌర్జన్యం చేశారని తాడిపూడికి చెందిన గణపతి అనే యువకుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాడిపూడికి చెందిన గణపతి గురువారం ఉదయం డీజిల్ కొట్టించుకున్న సమయంలో పంప్ న్యూట్రల్ చేయకుండానే తన టిన్లో డీజిల్ కొట్టడాన్ని గమనించి నిర్వాహకులను ప్రశ్నించాడు. దీంతో పంప్ ఆపరేటర్ తనపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వినోదం పంచి.. జ్ఞాపకాలు మిగిల్చి..

- యర్నగూడెంలో మూతపడిన శ్రీరామజేజీశ్వరి సినిమా థియేటర్
- 50 వసంతాల పాటు ప్రేక్షకులకు వినోదం



దేవరపల్లి మండలం యర్నగూడెంలోని 50 వసంతాల శ్రీరామజేజీశ్వరి థియేటర్

ప్రస్తుతం ఏదైనా థియేటర్‌లో ఈ రోజు ఏ సినిమా ఆడుతుందో చెప్పడం కష్టం. ఎందుకంటే ఒక సినిమా వారం, పది రోజులకు మించి ఆడటం లేదు. 50 రోజులు ఆడితే గొప్పగా చెప్పుకుంటున్నాం. ఒకే థియేటర్‌లో 100 రోజులు ఆడటం అంటే అది రికార్డుగా చెప్పుకుంటున్నాం. రెండు దశాబ్దాల క్రితం 365 రోజులూ ఒకే సినిమా ఆడిన థియేటర్లూ ఉన్నాయి. ఎన్నో సినిమాలను 100 రోజుల పాటు ఆడించి ప్రేక్షకులకు వినోదాన్ని పంచిన థియేటర్లు ప్రస్తుతం మూతపడి జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి.

దేవరపల్లి: సుమారు 50 ఏళ్ల పాటు కోట్లాది మంది ప్రేక్షకులకు వినోదం పంచిన దేవరపల్లి మండలం యర్నగూడెంలోని శ్రీరామజేజీశ్వరి సినిమా థియేటర్ మూతబడింది. 1974లో సంక్రాంతి పండుగ సందర్భంగా వీరభద్ర మహల్ పేరుతో యర్నగూడెంలో ఈ థియేటర్‌ను ప్రారంభించారు. తర్వాత పేరు మార్చారు. మెట్ట ప్రాంతంలోని దాదాపు 50 గ్రామాల ప్రజలకు ఈ థియేటర్ వినోదం, మానసిక ఉల్లాసాన్ని పంచింది. నేటికి ఈ థియేటర్ అర్ధశతాబ్దం పూర్తి చేసుకుంది. బళ్ల వెంకన్న అండ్ సన్స్ ఆ రోజుల్లో రూ.4 లక్షలతో నిడదవోలు రోడ్డులో థియేటర్ నిర్మించారు. అప్పటి వరకు ఉన్న టూరింగ్ టాకీస్ వ్యవస్థ పోయి సాంకేతిక పరిజ్ఞానంతో సినిమా థియేటర్ల నిర్మాణం జరుగుతున్న రోజుల్లో తమ బంధువైన కాకినాడకు చెందిన సినీ డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ నల్లం గోవింద్ సూచనతో ఈ థియేటర్‌ను నిర్మించారు.

ఎడ్ల బళ్లపై వచ్చి..

ఎడ్ల బండిపై గోపాలపురం, పంగిడి, నల్లజర్ల, పోతవరం, చిన్నాయగూడెం, బందపురం, త్యాజంపూడి, తాడిమళ్ల, దుద్దుకూరు తదితర గ్రామాల నుంచి ప్రేక్షకులు సినిమా తిలకించడానికి థియేటర్‌కు రావడంతో రాత్రి సమయంలో ఆ ప్రాంతం కోలాహలంగా ఉండేది. ఉదయం మార్నింగ్ షో, మధ్యాహ్నం మ్యాట్నీ, సాయంత్రం ఫస్ట్ షో, రాత్రికి సెకెండ్ షో వేసేవారు. కాలి నడకన, సైకిళ్లు, ఎడ్లబండ్లపై కుటుంబ సభ్యులంతా థియేటర్‌కు వచ్చి సినిమా చూచి తెల్లవారు జామున ఇళ్లకు చేరుకునేవారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం రావడంతో గ్రామీణ సినీ థియేటర్ల నిర్వహణ యజమానులకు భారంగా మారింది. ప్రస్తుతం అనేక ఒడుదొడుకులు, సమస్యలతో సతమతమవుతున్న థియేటర్లు మూతపడుతున్నాయి. కాగా, దేవరపల్లిలో 1978లో ప్రారంభించిన వేంకటేశ్వర థియేటర్ సుమారు 10 ఏళ్ల క్రితం మూతపడింది. ప్రస్తుతం అక్కడక్కడ ఉన్న థియేటర్లు కూడా ఒడుదొడుకుల్లో నెట్టుకొస్తున్నాయి. మెట్ట ప్రాంతంలోని గోపాలపురం, దొండపూడి, పోతవరం, నల్లజర్ల, చిన్నాయగూడెం, అనంతపల్లి, చాగల్లు, మలకపల్లి, తాళ్లపూడి, కొయ్యలగూడెం ప్రాంతాల్లో టూరింగ్ టాకీస్‌లు ఉండేవి. ప్రస్తుతం అప్పటి టాకీస్‌లన్నీ కనుమరుగయ్యాయి.

నమో వెంకటేశా.. నమో తిరుమలేశా..

నమో వేంకటేశా.. నమో తిరులేశా అంటూ ఘంటసాల కీర్తనలను వినిపిస్తూ తెర లేవడంతో అప్పటి వరకూ గోల చేసే ప్రేక్షకులు ఒక్కసారిగా నిశ్శబ్దాన్ని పాటించేవారు. నేల నుంచి రిజర్వుడు దాకా ఉండే విభాగాల్లో హోదా కనిపించేది. విద్యార్థులకు ఆదివారం, పండగ దినాల్లో మ్యాట్నీ ఆటకు సగం రేటు, ఉదయం ఆట భక్తిరస చిత్రాలు, మొదటి ఆట మధ్యలో వచ్చి రిజర్వు టికెట్ తీసుకున్న వారికి కంటిన్యూ సౌకర్యం కల్పించేవారు. విశ్రాంతి సమయంలో క్యాంటీన్ దగ్గర గోలీ సోడాల శబ్దాలు, సినిమా పాటల పుస్తకాల అమ్మకాలతో సందడి వాతావరణం ఉండేది. గ్రామాల్లో మైకుతో ప్రచారం చేసే రిక్షా వెనుక పిల్లలు పరుగులు తీసేవారు. అటువంటి సందడి రెండు దశాబ్దాలుగా పూర్తిగా కనుమరుగైంది.

ఆనాటి ఆ స్నేహమానంద గీతం..



గురువులతో కలసి గ్రూపు ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు



ఖండవల్లి ఉన్నత పాఠశాలలో 1985-86 బ్యాచ్ విద్యార్థులు

నల్లజర్ల: అనంతపల్లి జెడ్పీ హైస్కూలులో 2008–09 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 80 మంది పూర్వ విద్యార్థులు హాజరై గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నిమ్మలపూడి వీరరాఘవులు, కృష్ణమూర్తి, విమల, ప్రమీల, శ్రీహరి, వీర్రాజు, బాదుషాలను పూలమాలలు, శాలువాలతో సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. భర్త చనిపోయిన గాలింకి అనితకు ఆర్థిక సాయం చేయాలని వీరందరూ నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి తెప్పల తులసీజ్యోతి, ముళ్ళపూడి హరికృష్ణ, యజ్జవరపు అనిల్, శ్రీకాకుళపు విజయ్, లంక షణ్ముఖ సాయి, చుండ్రు నరేంద్ర, తుమ్మగంటి అపర్ణ, గోడు రమాదేవి నాయకత్వం వహించారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లి ఉన్నత పాఠశాలలో 1985–86వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అలనాడు కలిసి చదువుకున్న వారంతా ఓ చోట చేరి సందడి చేశారు. గురువులను సత్కరించటంతో పాటు ఆపదలో ఉన్న తోటి స్నేహితులను ఆదుకున్నారు. ఆర్థిక స్థితిగతులు అనుకూలించక బాధపడుతున్న ఇద్దరు స్నేహితులకు తలా రూ.50 వేలు చొప్పన సాయం అందించారు. రోజంతా విందు, వినోదాలతో ఆనందంగా గడిపారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై శోభన్‌కుమార్

నిడదవోలు : పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై శోభన్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ శాఖ రోడ్డు భద్రతకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నా అజాగ్రత్త కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. మద్యపానం సేవించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డిపో మేనేజర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు తమ విధులను జాగ్రత్తగా నిర్వహిస్తూ డిపో పరిధిలో ఎటువంటి ప్రమాదాలు జరక్కుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆర్టీసీ డ్రైవర్లచే ప్రతిజ్ఞ చేయించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొవ్వూరు: పట్టణంలోని శ్రీకృష్ణ చైతన్య నగర్‌లో అబ్దుల్ షకీలా బేగం అనే మహిళ ఇంట్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ నెల 11వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లారు. 15న ఉదయం పక్కింటి వాళ్లు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లు సమాచారం అందించారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు బీరువాలో దాచి ఉంచిన బంగారు ఆభరణాలు, గృహోపకరణాలు అపహరించినట్లు గుర్తించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపారు.